

# తెలిసొచ్చిన ప్రేమ

- నాగరాజు సురేంద్ర

అపర్ణ కనపడిందీవేళ. బస్సులో కనిపించింది. భర్తతో కనిపించింది. బాబుతో, ఇంకా బాబో పాపో తెలియని పసికందుతో కనిపించింది. భయం భయంగా, దీనంగా, దయనీయంగా, దిగులుగా, మూగగా ఉన్నట్టనిపించింది. బోసిగా, కళావిహీనంగా, చైతన్య రహితంగా ఉన్నదిమాత్రం నిజం అనిపించింది.

"స్టుపిడ్, డామిట్! నువ్వూ, నీ వెధవాలోచనలూను. నువ్వెప్పుడో ఇష్టపడి నీకు దక్కకుండా పోయినందుకు నీ కామె అలాగే కనిపిస్తుంది. ఇప్పుడామె తన భర్తతో హాయిగా, సుఖంగా, ప్రశాంతంగా ఉందని తెలుసుకోరా, ఇడియట్!" మనసు మూలల్లోని మరో నా రూపం నన్నే చీవాట్లు పెడితే తేరుకొని, 'అవును. నాది భ్రమేనేమో? అపర్ణ నిజంగానే తృప్తిగా, సంతోషంగా ఉందేమో? నాకే మరోలా ఉన్నట్టనిపిస్తుందేమో?' అనుకున్నాను. కానీ, ఆమె చెవులకు రింగులు కానీ, రింగుల్లాంటివి కానీ లేవు. వెంట్రుకలు అస్తవ్యస్తంగా... చీర మరీ మామూలుది. చెప్పులుకూడా... మొహం వాడిపోయినట్టు బోసిగా, దీనంగా... ఛత్! మళ్ళీ అలానే ఆలోచిస్తున్నానేమిటి? కానీ, ఈ కట్టూ, బొట్టూ, తీరూ ప్రత్యక్షంగా ఇలా కనబడుతున్నప్పుడు ఇంకా నా భ్రమ అనుకోనేమిటి?!

"ఏం? అపర్ణ ఎప్పుడూ ఖరీదైన, అందమైన బట్టల్లో విలాసంగా ఉండాలేమిటి? అలా లేకుంటే ఆమె అసంతృప్తిగా ఉందనుకోవాలేమిటి? సంసారం మొదలెడితే ఎవరైనా అలానే ఉంటార్రా, వాజమ్మా! నీకేం తెలుసు? నువ్వో వెధవ సన్యాసివి. లేకుంటే సన్యాసి వెధవ్వి. వెధవ వేషాలేమీ వెయ్యక నోరు మూసుకుని పడుండు." మనసు మూలల్లోని మరో రూపం మళ్ళీ మాట్లాడింది.

'అవును. సంసారపు బాదరబందీలో పడితే ఎవరైనా అలానే అవుతారో ఏమో?' మళ్ళీ నన్ను నేనే సమాధాన పరుచుకున్నాను.

అపర్ణ! మళ్ళీ ఇన్నేళ్ళ తరవాత కనబడింది. కానీ, ఇలా ఇక్కడ, భర్తతో... మైగాడ్! ఈ వేళ నా అసలు రూపాన్ని బయటపెట్టేలా ఉన్నాయి నా ఆలోచనలు.

అపర్ణది మా ఊరి ప్రక్కనే చిన్న పల్లెలాంటిది. వాళ్ళ నాన్న పెద్ద జమీందారు. అప్పట్లో మా ఊళ్ళో తప్ప చుట్టు పక్కల దగ్గర్లో పెద్ద స్కూలు లేకపోవడం వల్ల అపర్ణ మా ఊరికే రావలసివచ్చింది చదువుకోసం. అప్పుడు నేను అయిదో క్లాసులోనో, ఆరో క్లాసులోనో ఉన్నాను. కల్లా కపటం తెలియని ఆ చిన్న వయస్సులో అపర్ణ అంటే నాలో చెప్పరానంత ఆత్మీయత. అపర్ణ కనబడితే సంతోషం. అపర్ణ అంటేనే చెప్పరానంత ఇష్టం. కానీ, అప్పటి మా మనసులు ఎంత అమాయకంగా, ఎంత స్వచ్ఛంగా, ఎంత ఆహ్లాదంగా... అపర్ణ లెక్కలు బాగా చేసేది. క్లాసంతటికీ ఫస్టు. కానీ, ఇంగ్లీషు మాత్రం అంత బాగా రాదనే చెప్పాలి. మిగతా సబ్జెక్టుల్లో ఆమె ఏవరేజ్. నేనేమో అన్నిట్లో పైన ఉండేవాణ్ణి, ఒక్క లెక్కల్లో తప్ప. నాకు లెక్కల్లో అపర్ణకంటె తక్కువ మార్కులు రావడం అనేది చాలా సంతోషాన్ని కలిగించేది. కానీ, మిగిలిన అన్నింటిలోనూ నేను ఫస్టుగా ఉండడం కూడా సంతోషకరంగా ఉండేది నాకు.

రెండు మూడేళ్ళు గడిచిన తరవాత అపర్ణ మీద నాకు ఉండే ఇష్టం లాంటి, ఆత్మీయతలాంటి, ఇంకా మరేదో అనిర్వచనీయమైన, అసాధారణమైన, అస్పష్టమైన భావం బాగా బలపడిపోయింది. అప్పట్లో ప్రేమంటే ఏమిటో తెలియదు నాకు. అప్పట్లో ఏమిటి? ఇప్పటికీ తెలియదనే నా అభిప్రాయం. ఒక్క నాకే ఏమిటి? నా చుట్టూ ఉన్న ఈ వెధవల్లో, ప్రేమ ప్రేమంటూ పలవరించే ఈ స్టుపిడ్స్‌లో, ప్రేమించి పెళ్ళి చేసుకొని కాపురాలు వెలగబెడుతున్న ఈ డర్టీ రోగ్స్‌లో నిజంగా ప్రేమంటే ఏమిటో ఎవ్వరికీ తెలిసి చావదు. ప్రేమ అనే రంగు, రుచి, వాసన లేని పదార్థం ఒకటి కనీసం ఉంటుందని కూడా తెలియని నాకు అపర్ణ అంటే చచ్చేంత ఇష్టం మాత్రం ఉండేది. రోజుకు ఇరవై నాలుగు గంటలూ అపర్ణ గురించే ఆలోచించడం, రాత్రిళ్ళు కలల్లో కూడా ఆమె కనిపించడం చాలా మామూలుగా జరిగేది. అంత భద్రంగా నా మనస్సులో దాచుకున్న అపర్ణతో క్లాసులో మాట్లాడడం కాని, అదేపనిగా ఆమె వైపు చూడడం కాని చేసేవాణ్ణి కాదు నేను. అందరికీ తెలిసిపోతుందేమో నన్న భయమే ఎక్కువగా అందుకు కారణం. మంచినీళ్ళ కోసం అపర్ణ వాళ్ళు అద్దెకుంటున్న ఇంటికి పోవలసి వచ్చేది అప్పుడప్పుడు. అప్పట్లో నీటి కరువు పుణ్యమా అంటూ మా ఊళ్ళో మంచినీటికోసం చాలా దూరాలకు మగవాళ్ళే వెళ్ళవలసిరావడం దేవుడిచ్చిన వరం. అలా నేను నీళ్ళు తెస్తూ కనిపించినప్పుడు అపర్ణ ఆహ్లాదకరంగా నవ్వేది. నా కేమో అలా ఆమె కంటపడినప్పుడు చచ్చేంత సిగ్గుగా ఉండేది. మొహం చాటుచేసుకొని గమ్మత్తుగా నవ్వే అపర్ణ రూపం నా మనస్సు నుండి ఎప్పటికీ చెరిగిపోదు.

అపర్ణకు కూడా నేనంటే ఇష్టం లాంటిది ఉందని స్పష్టంగా తెలియజేసేదిలా ఉండేది ఆమె ప్రవర్తన. కాని, నాలా బయటపడిపోకుండా మాత్రం ఉండలేకపోయేది. త్రోవలో ఎదురుపడినప్పుడు తల వంచుకుని, కళ్ళు దించుకుని చిన్న చిరునవ్వుతో సిగ్గుపడుతూ త్వరత్వరగా, గాభరాగా నన్ను దాటుకు పోయేది.

వేసవి సెలవుల్లో అపర్ణ తన ఊరికి వెళ్ళిపోతే నాకు మహా దుర్భరంగా ఉండేవి సెలవులు. మళ్ళీ స్కూలు తెరిచే రోజు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూసేవాడిని. పదో క్లాసు పరీక్షలు వ్రాసి ఊరికెళ్ళిపోయిన అపర్ణ మళ్ళీ స్కూలు తెరిచిన రోజున కనబడలేదు. రెండు, మూడు, నాలుగైదు రోజులైనా రాలేదు. నాలో గాభరా ఎక్కువైంది. వారం రోజుల తరవాత తెలిసింది అపర్ణ ఇక మా ఊళ్ళో చదవదని. హెచ్.ఎస్.సి. కోసం టౌనుకు పంపిస్తున్నాడట వాళ్ళ నాన్న. 'ఆయనే వచ్చి టి. సి. తీసుకెళ్ళినట్టు చెప్పా రెవరో. దుఃఖం ముంచుకొచ్చింది నాకు. ఉక్రోషంతో, ఏడుపుతో ఒక రోజల్లా అన్నం తినలేదు. ఎవరికీ తెలియకుండా గదిలోకి వెళ్ళి తనివితీరా ఏడ్చేశాను. మిగిలిన ఆ ఒక్క సంవత్సరం కూడా అపర్ణను మా ఊళ్ళో చదివించనందుకు అపర్ణ వాళ్ళ నాన్న మీద కోపం వచ్చింది. తరవాత అపర్ణ మళ్ళీ కనిపించలేదు. కానీ, ఈ వేళ అనుకోకుండా మళ్ళీ ఈ బస్సులో, భర్తతో, బాబుతో—ఇంకా బాబో పాపో తెలియని పసికందుతో కనిపించింది.

చిత్రం—ఎస్. జయదేవ్ బాబు మద్రాసు—21



## ప్రాంగణంలో నైటింగేల్

మసక వెన్నెట్లో పచ్చికమధ్య రోజా తలూపుతోంది
మర్రిచెట్టు కొమ్మల్లోంచి చందమామ వెర్రిగా వింటోంది
నీ పాట
స్నిగ్ధమైన ఆకారసాయనాం ఊట
అలిగిన కథానాయికలా విసిరింది ఈవేళ గాలి,
ఆ ధాటికి నక్షత్రాలు రాలుతాయేమో చూడాలి.
అదిగో, ఉత్తుంగ రసావేశంలో ద్రవించే జలదాలు
అచల శృంగాలతో ఆడబోతున్నాయి సరసాలు.
శ్రావ్యంగా సేవ్యంగా నక్షత్రాల సరిగమలు
ప్రాంగణంలో పలకరిస్తున్నాయి.
నా సంతప్త శిరస్సుపై నీ గళంలోని అలలు
నభో వైశాల్యాన్ని చిలకరిస్తున్నాయి.
తొలిజాము దాకా నా స్వప్నపాత్రలో నీ గానం
తొణికించే ఎర్రని నిశ్వాసాల మత్తులో ఒక్క క్షణం
ఊరడిల్లుతాను కాస్సేపు ఘాటుగా గతాన్ని వంచి
ఉమర్‌ఖయ్యాంతో మధువు సేవిస్తున్నట్లు తలచి.

—పణతుల రామచంద్రయ్య

ఈ లోకానికి వచ్చేసి అపర్ణను చూశాను. ముందు సీట్లో కూర్చుని ఉంది. నన్ను చూడలేదు.

* * *

పరుగెత్తే బస్సులో ప్రయాణం చేస్తున్నప్పుడు నా మన సెప్పుడూ నిలకడగా ఉండదు. అనంతమైన భావనా ప్రవంతిలో కొట్టుకుపోతూ, అనిర్వచనీయమైన ఊహా ప్రపంచంలో తేలిపోవడం అనేది నే నెక్కువగా బస్సులో ప్రయాణం చేసేటప్పుడూ, చీకట్లో ఒంటరిగా ఉన్నప్పుడూ జరుగుతుంది. అందుకే నేను చీకటినీ, దూర ప్రయాణాలనీ ఇష్టపడతాను.

బస్సు నడుస్తూంటే ఆగిన ఊహల దారాన్ని మళ్ళీ లాగడం మొదలెట్టాను. హెచ్. ఎస్. సి. మా ఊళ్ళోనే పూర్తి చేసి సిటీకి వచ్చేశా న్నేను. అపర్ణను జ్ఞాపకం చేసుకోవడానికే తీరిక లేదన్నట్లుగా చదవవలసి వచ్చింది నాకు.

అపర్ణకంటే న న్నెక్కువగా కదిలించింది నీరద. నీరద మా అక్కయ్య స్నేహితురాలు. మా అక్కయ్య దగ్గరుండి చదువుకుంటున్న నాకు నీరదను మొదటిసారిగా చూసినప్పుడు ప్రత్యేకంగా ఏమీ అనిపించలేదు. అయితే, పక్కపక్కగా ఉండడం వల్ల నీరదకూ, మా అక్కయ్యకూ స్నేహం ఎక్కువైంది. అలా మళ్ళీ మళ్ళీ నీరదను చూడడంతో నాలో సంచలనం మొదలైంది. నీరద ఆకర్షణకు తట్టుకోలేకుండా అయిపోయి, ఆమెది పరిపూర్ణమైన సౌందర్యం అని తెలుసుకునేసరికి చాలా రోజులయింది నాకు. నీరద ఎంత మనోహరంగా, ఎంత సుందరంగా, ఎంత ఆహ్లాదకరంగా ఉంటుందో చెప్పడానికి భాషే చాలదనుకునే స్థితికి వచ్చింది నా మనస్సు. రోజా కిటికీ దగ్గర నిలబడి బయటకు చూస్తున్నట్టు నటించేది. నే నివతలికి వస్తే చెప్పరానంత సంతోషంతో వెలిగిపోయేది ఆమె ముఖం. మొదట్లో ఇది నాకు నేనే కల్పించుకున్న భ్రమ అనుకున్నాను. మనస్సు ఎంత చిత్రమైంది! మనలో నిక్షిప్తంగా ఉండే ప్రతి మనోభీష్టాన్నీ దృఢపరిచేదిలా కనిపింపజేస్తుంది. లేకుంటే నీరద విషయమై నా ఆలోచనలు ఆ విధంగా ఎందుకు సాగాలి? 'ఛీ ఛీ! వెధవ మనస్సు' అనుకున్నాను. కానీ, తరవాత తరవాత నీరద ప్రవర్తన తన అంతరంగాన్ని ఉన్నదున్నట్టుగా బయటపడేలా చేసేట్టుగా ఉందని ఖచ్చితంగా రూఢి కావడం అతి సులభంగా, అతి త్వరలోనే జరిగిపోయింది. నేను కనబడితే ఒక లిప్తకాలం పాటు కూడా ఆమె చూపులు నా మీద కాకుండా మరొక చోట ఉండేవి కావు. బాహ్యప్రపంచాన్ని పూర్తిగా మరిచి రెప్పవాల్చకుండా అంత పరవశంగా నన్నే చూడడం నాకు ఇష్టమే అనిపించినా, ఇబ్బందిగామాత్రం ఉండేది. మై గాడ్! ఎలా తప్పుకునేది ఈమె చూపుల నుండి? ఎలా తట్టుకునేది ఈమె ఆకర్షణ నుండి? విపరీతమైన కలవరం మొదలైంది నాలో. దీ న్నేమంటారు? ప్రేమేనా! ఏమో? లేక కేవలం ఇష్టమా? ఇదీ అని ఖచ్చితంగా చెప్పడానికి సాధ్యం కాని ఆ అనిర్వచనీయమైన అనుభూతి ప్రేమో, కాదో తేల్చుకోవడానికి తల పగిలేలా ఆలోచించినా లాభం లేకపోయింది. ఎదలో అనంతమైన అశాంతితో, అసహనంతో వేగిపోయాను. మహా మహా రచయితల పుస్తకాల్లో చదివినదంతా ఏమైనట్టు? ఏదీ తేల్చుకోలేకపోతున్నా నేమిటి? ప్రేమంటే ఏమిటో తెలియడం లే దెందుకు? ఎలా సహించే దీ అంతర్మథనాన్ని? ఆ పుస్తకాల మీదా, ఆ రచయితల మీదా పట్టరానంత కోపం వచ్చింది. ప్రేమ అనేది పుస్తకాల్లో ఎంత ఎక్కువగా చదివి, ఎంత బాగా అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తే అంత క్లిష్టంగా, అంత కష్టతరంగా తయారవుతుందనుకొని నా అసహాయతకు తిట్టుకున్నాను.

నీరద అంటేనే నీలి కళ్ళూ, నీలి కురులూ గుర్తుకొస్తాయి నాకు. మహిమాన్వితమైన ఆమె కళ్ళూ, ఆ వెంట్రుకలూ నన్ను పిచ్చివాణ్ణి చేశాయి. ఉండబట్టలేక —

‘‘నీలి జలదాలు కరిగి నీ జడగ పారె,
నీల గగనాలు విరిగి నీ కనుల పూచె’’

అని వ్రాసుకున్నాను. ఆ రెండు పంక్తులు చదువుకున్నప్పుడల్లా నా హృదయంలో లీలగా కదులుతుంది నీరద.

అపర్ణతోకాని, నీరదతోకాని నేను మాట్లాడే ప్రయత్నం చేయకపోవడానికి కారణం నా జంకు గాని, నా భీరుత్వంగాని కాదు. ఇవి నన్ను నేను సమర్థించుకోవడం కోసం అనుకుంటున్న మాటలు కావని కూడా గట్టిగా తెలుసు నాకు. అయితే, మరి అసలు కారణం ఏమిటి? మౌనమనే మహా సంగీత ప్రవంతికి అడ్డొస్తాయి మాటలు అని ఎవరో అన్నట్టు సౌందర్యాన్ని చూసి ఆరాధించి, ఉన్నతమైన, మహోదాత్తమైన అనుభూతిని పొందడం కంటె భాగ్యం మరొకటి ఏముంటుంది? మహిమాన్వితమైన మహా సంగీత ఝరిలాంటి సౌందర్యారాధనకు అడ్డొచ్చే మాటల్లాంటి సౌందర్యాస్వాదనకోసం తాపత్రయపడడం నా అభిమతం కాదు. అయితే, ఎప్పటికీ ఇలానేనా? కానవసరం లేదు; కాకూడదు కూడా. అయితే, మరెలా? అవును, ఎలా? మళ్ళీ బుర్ర పగిలేటట్టు ఆలోచనలు, అశాంతి, ఆవేదన.

నీరద వాళ్ళు ఇల్లు ఖాళీచేశారని తెలిసినప్పుడు నాకు బాధ కలిగినా, ఏడవలే దెందుకో. 'చాలు, నీరదా, చాలు. నువ్విచ్చిన నీ అందమైన అనురాగపూరిత సౌందర్య భిక్ష తాలూకు మధురానుభూతుల స్మృతులు నా మనస్సుకు వేయికాలాలపాటు సరిపోతాయి. నువ్వెక్కడున్నా, నీ పూర్తి క్షేమమే నేను కోరుకునేది' అనుకున్నాను. చివరి వాక్యం నాది నాకే ఎబ్బెట్టుగా తోచింది. భగ్నప్రేమికుడైన సినిమా హీరోలా ఏమిటీ చీప్ డైలాగ్ అనిపించింది. నీరద మళ్ళీ కనిపించలేదు. అపర్ణమాత్రం అనుకోకుండా ఈ వేళ మళ్ళీ ఈ బస్సులో, భర్తతో, బాబుతో, ఇంకా బాబో పాపో తెలియని పసికందుతో కనిపించింది.

మళ్ళీ ముందుకు చూశాను. కిటికీ లోంచి బయటకు చూస్తూంది అపర్ణ. నేను దిగవలసిన స్టేజీ వచ్చేసింది. దిగుతూ దిగుతూ సూటిగా చూశాను అపర్ణ ముఖంలోకి. నిశితంగా కళ్ళలోకి చూశాను. గుర్తు పట్టింది అపర్ణ. చలించిపోయింది. కళ్ళలో కలవరపాటు కదిలింది. నిస్సహాయంగా, నిశ్చలంగా, నిర్లిప్తంగా అపర్ణ! ఇంటికి చేరుకున్నాను.

* * *

రాత్రి చీకటిపడిన తరవాత చీకట్లో ఒంటరిగా కూర్చుని ఊహల ఆహారాన్ని భోజనం చేయడం మొదలెట్టాను. ఉదయం బస్సులో సశేషంగా ఆగిన ఊహల వాహిని మళ్ళీ సాగింది. అపర్ణ మీదగాని, నీరద మీదగాని నా కుండిన భావం ప్రేమ అసలే కాకపోయిన పక్షాన ఉదయం అపర్ణను భర్తతో చూసినప్పుడు నా కేమాత్రం బాధలాంటిది కలగకపోయి ఉండవలసింది. అయితే, మరెందు కలా నాలో అవ్యక్తమైన, అస్పష్టమైన బాధ లాంటిది పొడసూపినట్టనిపించింది? అపర్ణ నాకు కాకుండా పోయినందుకు గాని బాధపడలేదు గదా నేను? అనుకున్నాను. ఛ ఛ! నా బాధకు కారణం అదిమాత్రం కానేకాదు. అసలు అపర్ణను నా దానిగా చేసుకోవాలని నే నెప్పుడూ అనుకోనేలేదు. నన్ను విడిచి, నాకు దూరంగా వెళ్ళిపోయి చాలాకాలం తర్వాత కనిపించినందుకే నే నలా వేదన చెందానని పించింది. కానీ, ఏ సమాధానమైనా నా మనస్సును తృప్తిపరచలేక పోతున్నది. ‘‘ఒక్కోసారి మన మనస్సులో ఏముందో మనకే సరిగ్గా తెలియదు. ఎంత విచిత్రం! ఎంత దుర్భరం!’’ రాగిణి మాటలు గుర్తుకొచ్చాయి. ఎంత బాగా చెప్పింది రాగిణి! రాగిణి ఇలా అన్నది నాతో కాదు; స్నేహితురాలితో. క్లాసుముందు మెట్ల మీద కూర్చుని సుహాసినితో అంటూంటే

వినబడింది నాకు. అసలు నేను రాగిణిని మొట్టమొదటిసారిగా చూసింది— అవును, గ్రాడ్యుయేషన్ తర్వాత.

అనుకున్నట్టుగా పి. జి. లో సీటొచ్చింది నాకు. జాయిన్ కావడానికి కాలేజీకి వెళుతున్న రోజది. ఆ రోజే మొదటి సారిగా నేను రాగిణిని చూడడం జరిగింది. నా లాగే బస్సుకోసం వెయిట్ చేస్తూంది. నాకంటే కొద్దిగా ముందున కుడివేపున నిలబడి ఉంది. బస్సు స్టాపులలోగాని, రోడ్లమ్మటగాని అందమైన ఆడవాళ్ళు కనబడితే ఆసక్తిగా చూడడం నా కలవాటు. అలా చూడడం తప్పు కాదని నేనంటే ఎవరైనా ఒప్పుకోకపోయినా నాకేం భయం లేదు. లోకానికి జంకుతూ మనస్సును చంపుకొని బ్రతికే బదులు సహజమైన మనోధర్మాన్ని పాటించటమే ఉచితమని నా అభిప్రాయం. అందమైన పువ్వుల్నీ, ప్రకృతినీ చూసి ఆనందించి నట్టే, ఆదమరిచినట్టే సహజమైన స్త్రీ సౌందర్యాన్ని చూసి ఆనందించడం తప్పెలా అవుతుందో నా కర్థం కాదు. ఏ విధంగానైనా ఎవ్వరికీ అనర్థదాయకం కాని ఏ పనీ నేరం కాదని నా గట్టి నమ్మకం. ఇదంతా చెబితే విని ఈ మాటలన్నీ నా అలవాటుని సమర్థించుకోవడానికేననీ, లేకుంటే సంజాయిషీ ఇచ్చుకోవటం లాంటి దానికోసమేననీ ఎవరైనా అంటే, వాళ్ళమీద జాలిపడటం తప్ప నేను చేయగలిగిందేమీ లేదు.

అలా రాగిణిని చూస్తూ నిలబడ్డాను. చాలా సింపుల్‌గా ఉంది. చుట్టూ చాలా మంది ఉండడం వల్లనేమో తల కిందికి దించుకుంది. అప్పుడప్పుడు తల పైకెత్తి బస్సుకోసం చూస్తూంది. వెనక్కి తిరిగి చూసింది. అయిదు నిమిషాల్లో మళ్ళీ ఓ రెండు మూడు సార్లు చూసింది. ముఖం పూర్తిగా కనిపించింది. 'ఫెయిర్ బ్యూటీ' అనుకున్నాను. కానీ, నన్ను చూడకుండా నా బట్టల్ని చూస్తూందేమిటి? డ్రెస్ చూసుకున్నా నో సారి. కొత్తగా కుట్టించుకున్న ముదురు రంగు బట్టల్లో దిష్టిబొమ్మలా కొట్టవచ్చినట్టున్నాననిపించి ఏడుపొచ్చినంత పని అయింది. రౌడీ వెధవ ననుకుంటుందో ఏమో? చేసే దేమీ లేక అసహనంగా నిలుచున్నాను. నే నొచ్చిన బస్సులోనే ఆమెకూడా వచ్చిందని బస్సు దిగిన తర్వాత తెలిసింది నాకు. నా కంటే ఓ పది గజాల ముందర నడుస్తూంది. కాలేజీలోకి వెళుతూంటే చూశాను. గుడ్ గాడ్! అయితే, ఈమె కూడా ఇందులోనే చదువుతుందన్న మాట. ఆమె వెనకాలే వెళ్ళాలనిపించి ఆమెను అనుసరించాను. మెట్లమీదుగా నడుస్తూంది—పైనున్న క్లాస్‌రూమ్‌కు వెళ్ళడానికి కాబోలు. మెట్ల మలుపు దగ్గర వెనక్కి తిరిగి నన్ను చూసిన ఆమె ముఖంలో చెప్పరానంత విస్మయం కనబడింది. ఫస్ట్ పీరియడ్ చెప్పేసి అప్పుడే బయటికి వచ్చిన లెక్చరర్‌కు పేరు చెప్పి అటెండెన్స్ వేయించుకుంది. పేరు స్పష్టంగా వినబడింది నాకు. 'రాగిణి'—మనసులోనే అనుకున్నా నో సారి. క్లాసులోంచి బయటికి వచ్చిన స్టూడెంట్స్‌ని అడిగితే తెలిసింది నాకు అదే నేను కూర్చోవలసిన ఫస్ట్ ఇయర్ క్లాస్‌రూమ్ అని. 'థాంక్ గాడ్! అయితే, రాగిణి నా క్లాస్‌మేట్ అన్న మాట.' చెప్పరానంత ఆనందం కలిగింది.

అప్పటినించి రోజూ ఇద్దరం ఒకే బస్సులో వెళ్ళేవాళ్ళం. బస్సు స్టాప్‌కు వస్తూనే నా కళ్ళు రాగిణికోసం వెతికేవి. ఎంత ఛార్మ్ ఆ ముఖంలో! అందం కంటె ఆకర్షణ ఎక్కువగా ఉంటుంది రాగిణిలో. ముద్దబంతిలా స్వచ్ఛంగా, సహజంగా, సుందరంగా...అబ్బ! భరించలేనంత ఎట్రాక్షన్. అసలు నన్ను చూసీ చూడనట్టు, ఎంత నిర్లక్ష్యంగా—అయినా నా అభిమానం దెబ్బతినడంలే దెందుకని? పైగా అలాంటిదే ఏదో కావాలని—ఎంత నిండుగా కట్టుకుంటుందని చీరని! పాదాలనుండీ మెడదాకా, చూడగానే ఎవరికైనా గౌరవభావం కలిగేలా మనోహరంగా, మనోజ్ఞంగా, మధురంగా... ఓహ్!

ఆంతర్య వ్యక్తీకరణలో రాగిణి తీరు నీరదకూ, అపర్ణకూ పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఏమాత్రం బయటపడిపోకుండా గుప్తంగా, గుట్టుగా ఉండడానికి ప్రయత్నిస్తుంది రాగిణి. ఎంత హుందాగా ఉంటుందని! రాగిణికి సామాజిక స్పృహ ఎక్కువేనేమో ననిపించింది నాకు. పరిసరాల్ని మరిచిపోకుండా జాగ్రత్తగా మసలడమనే గుణం ఆమెలో కొట్టవచ్చినట్టుగా కనబడుతుంది. నేనెటో చూసేవేళల్లో ఎవరి కంటా పడకుండా దొంగతనంగా నా వైపు తన్మయత్వంతో చూడడం గమనించగలిగా న్నేను. నే నటు చూస్తే చటుక్కున చూపును మరల్చుకొని ఏమీ తెలియనట్టుగా, దొరికిపోగూడదన్నట్టుగా—తర్వాత తర్వాత ఇక లాభం లేదని తెలుసుకుంది. సూటిగా కళ్ళలోకి చూసినప్పుడు కళ్ళు కళ్ళూ కలిసి బెదురుతో, కలవరపాటుతో సతమతమవుతుంది. అలాంటప్పుడు చచ్చేంత నవ్వొస్తుంది నాకు.

కాలేజీ వదిలిన తర్వాత ఇంటికి వెళ్ళేటప్పుడు త్రోవలో, బస్సులో, బస్సు దిగిన తర్వాత మళ్ళీ త్రోవలో సాధ్యమైనంతవరకు రాగిణికి వెనకాలే నడవడానికి ప్రయత్నిస్తా న్నేను. లేకుంటే




రేజర్‌వల్ల కలిగే చర్మగాట్లు, సరిగా తెగని రోమ మొదువల్ల అవమానం భరించండి లేక...

ఎన్ ఫ్రెంచ్ హెయిర్ రిమూవర్ వాడి చర్మాన్ని పట్టులా కోమలంగా ఉంచుకోండి



క్షౌరమా?—అది కేవలం పురుషుల కోసం! క్షౌరం వల్ల చర్మం మీద గంట్లు పడటమే కాకుండా రోమములు దట్టంగా దుబ్బులా తిరిగి పెరుగుతాయి. ఎంత ఘోరం! దానికి బదులు కోమలాంగుల సుకుమారమైన పద్ధతిలో రోమములను క్రీముతో తీసి వేయండి. మృదువైన ఎన్ ఫ్రెంచ్ హెయిర్ రిమూవర్‌ను రాయండి. కొంత సేపు ఆగండి. తరువాత దానిని అనవసరమైన రోమములతో సహా తుడిచి వేయండి. ఇది చర్మం అడుగున పని చేసి చర్మాన్ని తారాల తరబడి పట్టువలె—నున్నగా ఉంచుతుంది. ఎంత లావణ్యమైన పద్ధతి! మీ లాగానే!! కనుక క్షౌరాన్ని మానండి. ఎన్ ఫ్రెంచ్ హెయిర్ రిమూవర్ వాడండి.




ఎన్ ఫ్రెంచ్ హెయిర్ రిమూవర్
అనవసరమైన రోమముల నుండి విముక్తికి వాంఛనీయమైన క్రీమ్
రెండు సైజులలో లభించును 40 గ్రా. & 75 గ్రా.

Licensed user of TM : Geoffrey Manners & Co. Ltd.


126 HR 242 Ti

ఆమెను కనీసం వెనుకనుండైనా చూసే భాగ్యం కరవైపోతుందని నా భయం.

అకస్మాత్తుగా బయట రూమ్ తీసుకొని వేరే ఉండవలసిన అవసరం వచ్చింది నాకు. పరిస్థితుల మీద పట్టరానంత కోపం వచ్చింది. 'బస్సుకోసం వెయిట్ చేస్తూ, బస్సులో ఆమెనే చూస్తూ, బస్సు దిగిన తర్వాత నడుస్తూ రాగిణి మంచి పొందే అంతటి అనుభూతిని వదులుకోగలనా నేను? ఇంతటి శిక్ష నెలా భరించగలను?' అనిపించింది. కానీ, లాభం లేకపోయింది.

తర్వాత అంతగా పెద్ద పనేమీ లేకపోయినా, పాత రూట్ లోనే బస్సులో వెళ్ళి రాగిణి వెనకాల నడవడం చేస్తూ వచ్చాను. ఒక సారి వరసగా వారం రోజులు ఆ రూట్ మీదుగా తిరిగి వెళ్ళాను కాలేజీకి. నేను వెనకాల ఉన్నప్పుడు మెడకూడా కనబడకుండా నిండుగా చీరతో కప్పుకొని, తడబడే అడుగులతో నడుస్తూ, రాగిణి తల కూడా తిప్పకుండా కంటి కొసల్లోంచి దొంగతనంగా నన్ను చూస్తూ — సిల్లీ గర్ల్!!!

ఆ మధ్య ఓ సారి మహా శివరాత్రి రోజున కనిపించింది రాగిణి. బుధవారం అనుకుంటా నా రోజు. రోజూ క్లాసులో చూస్తున్నా ఆ రోజు మాత్రం చాలా భిన్నంగా కనిపించింది. అదే — మా పాత బస్సు స్టాప్‌లోనే బస్సుకోసం నిలబడ్డాన్నేను. నాకు ఎడమ వేపున కొంచెం దూరంగా నిలుచుని ఉన్న రాగిణిని కొంత సేపైనాక గానీ చూడలేదు నేను. చూస్తూనే అప్రతిభు ణ్ణయాను. పూలుఉన్న తెల్లటి కొత్త చీరలో అసమాన సౌందర్యంతో వెలిగిపోతున్నది. గుడికి వెళుతుందేమో అనుకున్నాను. అప్రతిమాన తేజోవారాశిలా అనూహ్యమైన దర్పస్సుతో, అనన్యమైన దీప్తితో ఎంత నిర్మలంగా, ఎంత నిశ్చలంగా, ఎంత నిరుపమానంగా వెలిగిపోతున్నది రాగిణి! ఎంత పవిత్రంగా, ఎంత శుచిగా, ఎంత స్వచ్ఛంగా! రాగిణిలో నిద్రాణంగా ఉన్న ఇంతటి అందాన్నీ, ఆకర్షణనీ ఒక్కక్షణమైనా నే నెప్పుడూ చూడలేదు. 'ఏ తావిలో విరిసిన పారిజాతమో ...' పాట గుర్తు కొచ్చింది. ముఖం మీద పడ్డ ముంగురుకల్ని సుతారంగా సరిచేసుకుంటోంది రాగిణి. కదులుతూంది. అలవోకగా, అందంగా, హాయిగా, మెల్లగా, మెత్తగా — నా మనసు వశం తప్పుతోంది. ఏమి టేది! ఎందు కిలా? మైగాడ్! దగ్గరగా వెళ్ళి నుదురు మీద మెదువుగా ముద్దు పెట్టుకోవాలని



ముదిమి చిత్రం—కె. గోపాలరావు (ప్రత్తిపాడు)

కోరిక. ఆమెలోని ప్రతి కదలికా నన్ను పిచ్చివాణ్ణి చేసేస్తూం దేమిటి? అలాంటి సంచలనం కలగడం జీవితంలో అదే మొదటిసారి నాకు. స్తంభానికి అనుకొని చాటుగా నేను. నన్ను చూసింది రాగిణి. చిన్నగా నవ్వింది. జల్లుమంది నా ప్రాణం. కానీ, మళ్ళీ ఎటో చూస్తూంది. వెంట ఇద్దరు రబ్బాయి లున్నారు—ఒకతను మరీ చిన్న వెంట్రుకలతో — తమ్ముడేమో? రాగిణి మళ్ళీ నన్ను చూడలేదు. కనీసం తలనైనా ఇటు తిప్పలేదు. రెండు నిమిషాలు, అయిదు నిమిషాలు, పది నిమిషాలయిపోయింది. ఉహూఁ. కనీసం నే నక్కడ ఉన్నాననే విషయం కూడా గుర్తులేనట్టు, నా ఉనికినే మరిచినట్టు, నువ్వెంత అన్నట్టు, నిర్లక్ష్యంగా నన్ను సవాల్ చేస్తున్నట్టు, నన్ను హేళన చేస్తున్నట్టు భరించలేకపోయాను. అవమానం, బాధ, ఉక్రోషం, ఏడుపు—అన్నీ ఒక్కసారిగా వచ్చినట్టు, నా అభిమానం దెబ్బతిన్నట్టు

నా కెప్పుడూ అలా జరగలేదు. రాగిణి ఎన్ని సార్లు నన్ను చూసీ చూడనట్టు నటించినా, నా కేమీ బాధ కలగలేదు. కాని, ఈ సారి మాత్రం కావాలనే నన్ను నిర్లక్ష్యం చేస్తున్నట్టనిపించింది. బస్సు వచ్చింది. రాగిణి బస్సెక్కి వెళ్ళిపోయింది, తిరిగి చూడకుండా.

ఆ రోజంతా చెప్పరానంత బాధపడిపోయాను. రాగిణి నిజంగా ఎంత నిర్దయగా ప్రవర్తించింది! ఎంత కర్కశంగా నన్ను చిత్రవధ చేసింది! నన్ను ఓడించి పరిహసిస్తున్నట్టనిపించింది. అదే రూపం పారిజాతంలా, పాలసంద్రంలా, పావన గంగా తరంగంలా కవ్విస్తుంది నన్ను. కళ్ళు తెరిచినా, కళ్ళు మూసినా కళ్ళనిండా, మనసునిండా కోమలమైన రాగిణే!

'రాగిణి నన్ను మలకిన చేయలే దసలు. సహజమైన బిడియంతో మళ్ళీ మళ్ళీ నన్ను చూడలే దంతే. ఇదిమాత్రం నిజం. తప్పకుండా రాగిణికి నేనంటే ఏమిటి? ప్రేమా! కాకున్నా అలాంటిదేదో ''ఇది'' ఉంది. తప్పకుండా' అనుకొని నిద్రపోయాను.

మరునాడు క్లాసులో రాగిణి మునపటిలానే, అప్పుడప్పుడు నా వేపు చూస్తూ, ఇంకా మునపటికంటే కొంచెం 'ఇది' గానే ఉంది. ''ప్రపంచంలో అర్థంకాని విషయం స్త్రీ.'' ఎక్కడో చదివింది గుర్తు కొచ్చింది. మనస్సు తేలిక పడింది. రాగిణికి నేనంటే నిర్లక్ష్యం లే దసలు. నేనే అనవసరంగా ఏదేదో పిచ్చిగా ఊహించుకున్నాను.

అప్పటినుండి రాగిణి రోజూ నే ననుకున్న దానికంటే ఎక్కువగా మనస్సును రంజింపజేస్తున్నది—ఎంత మంచి రెస్పాన్స్‌తో!

నీరదా అపర్ణలు గుర్తు కొచ్చారు. రాగిణి మీద నాకు వాళ్ళిద్దరి మీద కంటే ఎంత భిన్నమైన భావం ఉంది! రాగిణి వేరు, వాళ్ళు వేరు అనిపించింది. ఎన్నాళ్ళుగానో తెలియక చస్తున్న 'ప్రేమ' తెలిసొచ్చిన ట్టనిపించింది.

మనసు మూలల్లోని నా మరో రూపం కదిలి మళ్ళీ మాట్లాడింది. ''రాగిణి కూడా వాళ్ళలాగే అయి బస్సులో... భ ... '' 'నో నో వీల్లేదు ... అలా జరగడానికి వీల్లేదు. రాగిణి నా ప్రాణం, రాగిణి నా అంతరాత్మ, రాగిణి నా జీవితం, రాగిణే నా సర్వం, రాగిణి నా ...'

''రాజూ!'' అమ్మ పిలిస్తే లేచి వెళ్ళాను. ★